క్లుప్తంగా

ఎంపీకి వినతి



దోమలపెంట: గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించాలని దోమలపెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు కె.మోయిజ్, బి.మల్లికార్జున, గురువయ్య, పార్థసారథి, కుమార్, చంద్ర, రసూల్ తదితరులు నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం శ్రీశైలం దర్శనానికి వచ్చిన ఎంపీ మల్లురవిని ఈగలపెంటలోని జెన్‌కో అతిథి గృహం కృష్ణవేణి వద్ద స్థానిక నాయకులు కలిసి విన్నవించారు. వీధిలైట్ల ఏర్పాటు చేయాలని కోరారు. ఎంపీ మల్లురవి స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

క్షయ వ్యాధిని నిర్లక్ష్యం చేయొద్దు

బిజినేపల్లి: క్షయ వ్యాధిని నిర్లక్ష్యం చేయొద్దని పాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రియాంక అన్నారు. శుక్రవారం మండలంలోని పాలెం గ్రామ పంచాయతీ ఆవరణలో టీబీ ముక్త భారత్ అభియాన్ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ టీబీ రోగుల కుటుంబసభ్యులకు దీర్ఘకాలిక వ్యాధులు, తెమడ పరీక్షలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది రాజేశ్వరీ, శ్రీనివాసులు, గోవర్ధన్, గజవర్ధనమ్మ, మల్లిక, ఆశాలు పాల్గొన్నారు.

రుతుక్రమంపై అవగాహన

కల్వకుర్తి టౌన్: విద్యార్థినులకు రుతుక్రమంపై అవగాహన ఉండాలని మానవత ఫౌండేషన్ అధ్యక్షురాలు డా. రమ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని సరస్వతి శిశుమందిరంలో విద్యార్థినులకు నెలసరి సమస్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కౌమార దశలో వచ్చే సమస్యలపై కనీస పరిజ్ఞానం ఉండాలన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం విద్యార్థినులకు వచ్చిన పలు అనుమానాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో మానవత ఫౌండేషన్ సభ్యులు సందీప్, ప్రవీణ్, ఉదయ్, అనిల్, పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

చారకొండ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బాల్‌నర్సింహ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం సీపీఐ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పార్టీ ఆవిర్భావ శత వార్షికోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు చిల్వేరు శ్రీనివాసులు, కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరశురాములు, ఏఐటీయూసీ కార్యదర్శి శివ, నాయకులు గడ్డం శ్రీనివాసులు, తస్నీరు మల్లయ్య, జెల్ల కృష్ణయ్య, నారాయణ రెడ్డి, జెల్ల బాలయ్య, మొగిల్ల శ్రీను, అశోక్ గౌడ్, శంకరయ్య, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో ఉపాధ్యాయుడి ప్రతిభ

తాడూరు: ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ పోటీలలో భాగంగా హైదరాబాద్ జింఖానా గ్రౌండ్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో మండలానికి చెందిన ఉపాధ్యాయుడు మహేష్ ప్రథమ స్థానంలో నిలిచాడు. మండలంలోని పాపగల్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న మహేష్ అథ్లెటిక్స్ 800మీటర్ల విభాగంలో ప్రథమ స్థానంలో గెలుపొందినట్లు ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. త్వరలో చండీఘడ్‌లో జరగనున్న జాతీయస్థాయి ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ పోటీలలో తెలంగాణ తరుపున పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు.

సారా పట్టివేత

పెంట్లవెల్లి: స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శుక్రవారం ఎక్సైజ్ అధికారులు గ్రామాల్లో దాడులు నిర్వహించారు. ఎంగంపల్లి తండా నుంచి పెంట్లవెల్లి గ్రామానికి ఇద్దరు వ్యక్తులు బైక్‌పై సారా తీసుకెళ్తుండగా 12 లీటర్ల సారాను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బైక్‌ను సీజ్ చేశారు. అనంతరం నిందితులను తహసీల్దార్ జయంతి ఎదుట బైండోవర్ చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ నాగిరెడ్డి, గద్వాల జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ సైదిరెడ్డి, ఎస్ఐ మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

వర్గీకరణతో మాదిగలకు న్యాయం

తిమ్మాజిపేట: వర్గీకరణతో మాదిగలకు న్యాయం చేకూరుతుందని ఎమ్మార్పీస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంగి విజయ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం లక్షడప్పులు–వెయ్యిగొంతులు కార్యక్రమంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30న జిల్లా కేంద్రంలో పర్యటించనున్న మందకృష్ణ పర్యటనను విజయవంతం చేయాలన్నారు. జోగు ప్రదీప్, దానం బాల్‌రాజ్, గూట విజయ్, జగన్‌రాజ్, దశరథం, టయ్యు, రామస్వామి, మనోహర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన గ్రామసభలు

సాక్షి, నెట్‌వర్క్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామసభలు శుక్రవారంతో ముగిశాయి. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి సంబంధించిన అర్హుల జాబితాను అధికారులు చదివి వినిపించారు. కల్వకుర్తి మండలం వేపూరు గ్రామసభలో కలెక్టర్ బదావత్ సంతోష్, నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దముద్దునూరు గ్రామసభలో ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ హాజరయ్యారు. మన్ననూర్‌లో నిర్వహించిన గ్రామసభలో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, ఏఐసీసీ కార్యదర్శి, పార్లమెంట్ ఇన్‌చార్జ్ విశ్వనాథన్‌లు పాల్గొని మాట్లాడారు. జాబితాలో పేర్లు లేనివారు ఆందోళన చెందొద్దన్నారు. కల్వకుర్తి మున్సిపాలిటీ 22వ వార్డులో చేపట్టిన వార్డు సభలో అడిషనల్ కలెక్టర్ దేవసహాయం పాల్గొన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. తెలకపల్లి గ్రామసభలో బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు.



కల్వకుర్తి పట్టణం 22వ వార్డులో దరఖాస్తులు స్వీకరిస్తున్న జిల్లా అడిషనల్ కలెక్టర్ దేవసహాయం

దీంతో కాంగ్రెస్ నాయకులతో వాగ్వివాదానికి దిగారు. ఒకిరికొకరు తోసుకున్నారు. పోలీసుల జోక్యం చేసుకొని శాంతింపజేశారు. కొల్లాపూర్, అచ్చంపేట, కోడేరు, తాడూరు, పెద్దకొత్తపల్లి, బల్మూర్, వెల్దండ మండలాల వ్యాప్తంగా గ్రామసభలు ఏర్పాటు చేశారు. ఆర్డీఓ మాధవి, కల్వకుర్తి ఆర్డీఓ శ్రీను నాయక్, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ సత్యం, నాగర్‌కర్నూల్‌లో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, డీఎస్పీ శ్రీనివాస్, ఎంపీడీఓ కోటేశ్వర్, తదితరులు ఉన్నారు.



తాడూరు ఎంగంపల్లిలో..



వెల్దండలో..



పెద్దకొత్తపల్లిలో..

క్రీడలతో మానసికోల్లాసం

అచ్చంపేట: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ,జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని రాజీవ్ ఎన్టీఆర్ మినీస్టేడియంలో సీవీకే ఆల్ ఇండియా క్రికెట్ టోర్నమెంట్‌ను వారు ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగానికి రూ.370కోట్ల నిధులు కేటాయించిందన్నారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అచ్చంపేటలో స్టేడియాన్ని తీర్చిదిద్దుతామన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్రంలో గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సీఎం కప్ పేరుతో క్రీడలను నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అనూష్య ప్రాజెక్టు అధినేత ఆండపల్లి జలంధర్‌రెడ్డి, రామకృష్టారెడ్డి, మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, ఉమామహేశ్వర ఆలయ



క్రికెట్ పోటీలు తిలకిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి, మార్కెట్ చైర్మన్ అంతటి రజితమల్లేష్, గ్రంథాయల చైర్మన్ రాజేందర్, కౌన్సిలర్లు గౌరిశంకర్, డీఎస్పీ శ్రీనివాసులు, నిర్వాహకులు చంద్రమోహన్, కటకం రఘురాం తదితరులు పాల్గొన్నారు.

మైలారంలో మైనింగ్ పనులు ఆపాలి



మాట్లాడుతున్న పర్వతాలు

బల్మూర్: మైలారంలో మైనింగ్ పనులు ఆపాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతాలు డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మైలారం గ్రామాన్ని సందర్శించి గ్రామస్తుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండానే తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో అనుమతులు తీసుకొని మైనింగ్ తవ్వకాలు నిర్వహించడం సరికాదన్నారు. గ్రామస్తులంతా మైనింగ్ తవ్వకాలను వ్యతిరేకిస్తూ ఉద్యమిస్తుంటే పోలీసుల సహకారంతో మైనింగ్ పనులు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్తులకు జీవనాధారమైన గుట్టపై మైనింగ్ త్వవ్వకాలను ఎలా అనుమతులు ఇచ్చారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మైనింగ్ ఆపాలని పార్లమెంట్ ఎన్నికలను గ్రామస్తులు బహిష్కరించారని గుర్తు చేశారు. స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకొని గ్రామస్తులను న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దేశ్యానాయక్, మండల కార్యదర్శి శంకర్‌నాయక్, సత్యంగౌడ్, రమేష్‌గౌడ్, బాల్‌నారాయణ, నవనీత్, తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా ముందుకు సాగుదాం

చారకొండ: ఆర్యవైశ్యులు కలిసికట్టుగా ముందుకు సాగుదామని నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో వేంకటేశ్వర దేవాలయంలో ఆర్యవైశ్యులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ హాజరై మాట్లాడారు. ఆర్యవైశ్యుల సంఘం అభివృద్ధికి సమష్టిగా పాటుపడుదామన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రాచమల్ల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా కూనం పాండు, కోశాధికారిగా అర్థం చంద్రయ్య, చారకొండ వాస పరమేశ్వర్ ప్రధాన కార్యదర్శిగా చిత్తనూరి రమేష్, కోశాధికారిగా రేచింతల అశోక్‌లను మరికొంత మంది సభ్యులతో ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు పానుగంటి అంజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, శ్రీధర్, వంగూరు మండల అధ్యక్షుడు సురేష్, వెల్దండ అధ్యక్షుడు అంజనేయులు, గందే రవి, ఆర్యవైశ్య మహాసభ నాయకులు శ్యాంసుదర్, నర్సింహ, తోటరాజు, దుగ్గి కుమారస్వామి, శివశంకర్, రవి, సంతోష్, కరుణాకర్ తదితరులు ఉన్నారు.

మానసిక దివ్యాంగులను చిన్నచూపు చూడొద్దు

నాగర్‌కర్నూల్ క్రైం: మానసిక దివ్యాంగులను చిన్నచూపు చూడొద్దని సీనియర్ సివిల్ జడ్జి సబిత కోరారు. జిల్లా కేంద్రంలో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవాదులకు మానసిక దివ్యాంగుల సంరక్షణపై నిర్వహించిన రెండు రోజుల శిక్షణ ముగింపు సమావేశంలో ఆమె హాజరై మాట్లాడారు. ఎవరైనా మానసిక దివ్యాంగులను గుర్తిస్తే డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీకి తెలియజేస్తే , మానసిక రోగులను హైదరాబాదులోని మానసిక వికలాంగుల కేంద్రంలో చేర్పించి తగిన చికిత్స చేయించి సాధారణ మనుషులుగా మార్చడానికి కృషి చేస్తామన్నారు. రిసోర్స్ పర్సన్ మధుసూదన్ రావు, రాజశేఖర్ ,శ్రీనివాసులు పాల్గొన్నారు.

పోస్టర్లు విడుదల

కొల్లాపూర్: సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించే 4వ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన మహాసభల పోస్టర్లను శుక్రవారం పట్టణంలో సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25వ తేదీ నుంచి 28వ తేదీ మహాసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు తారాసింగ్, సలీం, రాజు, బాలునాయక్, చందు ఉన్నారు.

గురుస్వామి రాజుకు నివాళి

తెలకపల్లి: హనుమాన్ మాలధారుడు, గురుస్వామి రాజు ఇటీవల మృతి చెందాడు. ఈమేరకు శుక్రవారం మండల కేంద్రంలోని శివగంగా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సంస్మరణ సభలో నాగర్‌కర్నూల్ ఎంపీ మలురవి హాజరై రాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో హనుమాన్ జనజాగరణ సమితి జాతీయ అధ్యక్షుడు జయరాం గురుస్వామి, రాష్ట్ర అధ్యక్షుడు మురళీకృష్ణ గురుస్వామి, ప్రధాన కార్యదర్శి శివయ్య గురుస్వామి, స్వామి, సురేందర్ గౌడ్, సత్యం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బైరాపూర్‌లో గంధోత్సవం



వెల్దండ: మండలంలోని బైరాపూర్‌లో సైదులు దర్గాలో శుక్రవారం గంధోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా టాస్క్ సీఓఓ, ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్ని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. ఇటీవల రూ.2.50లక్షల నిధులతో రేకులషెడ్ నిర్మించినట్లు తెలిపారు.

టెంకాయల వేలం వాయిదా

వెల్దండ: మండలంలోని గుండాల అంబా రామలింగేశ్వరస్వామి దేవాలయంలో టెంకాయల వేలం పాటను శుక్రవారం వాయిదా వేసినట్లు ఈఓ ప్రసాద్ తెలిపారు. వేలం పాటలో గతేడాది కంటే తక్కువగా పాట రావడంతో వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. త్వరలో వేలంపాట నిర్వహించే తేదీని ప్రకటిస్తామని తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

నాగర్‌కర్నూల్: నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని 18 వార్డులో నూతనంగా నిర్మించిన రోడ్లను, డ్రెయినేజీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, కౌన్సిలర్లు జక్కా రాజ్‌కుమార్‌రెడ్డి, సునేంద్ర, నిజాం , కావలిశ్రీను, బచ్చన్న, లలిత పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి


నాగర్‌కర్నూల్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి వినోద్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఎన్నికల సమయంలో స్వచ్ఛందంగా యువత కాంగ్రెస్ గెలుపు కోసం ఎంతో కృషి చేశారని వివరించారు. నామినేటెడ్ పోస్టుల్లో యువతకి తగిన స్థానం కల్పించాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. నాగర్‌కర్నూల్ అసెంబ్లీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి గౌడ్, జిల్లా కార్యదర్శి నాని గౌడ్, మండల అధ్యక్షుడు వినోద్, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ చిత్రపటం ఏర్పాటు చేయాలి



చారకొండ: గణతంత్ర దినోత్సవం వేడుకల్లో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగార్జున డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ పార్టీ అధినేత విశారదన్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో నాయకులు పోస్టుకార్డు ఉద్యమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉద్యమంలో 26న నిర్వహించే గణతంత్ర వేడుకల్లో అంబేడ్కర్ చిత్రపటం తప్పనిసరిగా పెట్టాలని, రాజ్యాంగ పీఠిక చదివించాలని కోరుతూ నాయకులు, ప్రజలు, విద్యార్థులతో ఉత్తరాలు రాయించి ప్రభుత్వానికి పోస్టు చేశారు. లక్ష పోస్టు కార్డు ఉద్యమంలో భాగంగా చారకొండలో 300 పోస్టుకార్డులు వేశారు. మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు మల్లేష్, మహేష్, యువకులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు



అచ్చంపేట రూరల్: పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. పరుగుపందెం , కబడ్డీ, ఖోఖో, రింగ్‌బాల్, స్కిప్పింగ్, కుర్చీలాట, రన్నింగ్, క్రికెట్, చెంచాగోళీ తదితర ఆటల పోటీలు ఏర్పాటు చేశారు.

పశువులకు వైద్య శిబిరం

తాడూరు: మండలంలోని పర్వతాయిపల్లి, తుమ్మలసుగురు గ్రామాల్లో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి ప్రవీణ్ కుమార్ గర్భకోశ నివారణ చికిత్సలు నిర్వహించారు. దూడలకు నట్టల నివారణ మందుల పంపిణీ చేశారు.

బాలికలపై వివక్ష చూపొద్దు

నాగర్‌కర్నూల్ క్రైం: బాలికలపై వివక్ష చూపొద్దని సీనియర్ సివిల్ జడ్జి సబిత అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలో మహాత్మాజ్యోతిబాపూలే వెనకబడిన తరగతుల సంక్షేమ పాఠశాలలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో భ్రూణ హత్యలు చేయడం చట్ట విరుద్ధమన్నారు. భ్రూణ హత్యలను అరికట్టడానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. ఆడపిల్లలు ఎవరైనా ఆపదలో ఉన్నప్పుడు డయల్ 100కు ఫోన్‌చేయాలని కోరారు. న్యాయవాదులు మధుసూదన్ రావు, ఎస్సార్ సత్యనారాయణ, శ్యాం ప్రసాదరావు, రామచందర్, కళాశాల ప్రిన్సిపాల్ లలితాకుమారి పాల్గొన్నారు.

కొల్లాపూర్: పట్టణంలోని కేజీబీవీ విద్యాలయంలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయవాదులు రామలక్ష్మమ్మ, ఎస్.నళిని మాట్లాడారు. బాలికల సంరక్షణకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం న్యాయవాదులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఇమ్మానుయేల్, ఎస్ఓ.నారాయణమ్మ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సబిత

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

తెలకపల్లి: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓటర్స్ దినోత్సవం పురస్కరించుకొని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ప్రజాస్వామ్యంలో ఎన్నికల పాత్ర అనే అంశంపై మండల స్థాయి ఉపన్యాసం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీలలో గౌరెడ్డిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థినిని మల్లీశ్వరి మొదటి స్థానం, శాంతినికేతన్ పాఠశాల విద్యార్థినిని శ్రీవాణి రెండో స్థానంలో నిలిచారు. ఉపన్యాస పోటీలలో శాంతినికేతన్ పాఠశాల విద్యార్థి వరప్రసాద్ మొదటి స్థానం, కేకే రెడ్డి పాఠశాల విద్యార్థిని సిరి ద్వితీయ స్థానం సాధించారు. విజేతలకు ఎంఈఓ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బహుమతి అందజేస్తున్న ఎంఈఓ

అధికారిపై దురుసుగా ప్రవర్తించటం సరికాదు



కల్వకుర్తి టౌన్: విద్యుత్ కార్యాలయంలోని ఏఆర్ఓ కార్యాలయ అధికారి ఏఏఓ రాజేశ్వర్ రెడ్డిని కొంత మంది ఉద్యోగులు దుర్భాషలాడుతూ, దాడికి యత్నించటం సరికాదని ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 327 యూనియన్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని విద్యుత్ శాఖలోని ఏఆర్ఓ కార్యాలయం ఎదుట సంఘం నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఉద్యోగులు అధికారిపై దాడికి యత్నించటం పూర్తిగా హేయమైన చర్య అని, ఇలాంటి దాడులను ఉపేక్షించేదిలేదన్నారు. అనంతరం సంఘం క్యాలెండర్, డైరీలను ఏడీ, ఏఈలతో కలిసి ఆవిష్కరించారు. నిరసనలో జిల్లా ప్రధాన కార్యదర్శి లాలయ్య, డివిజన్ అధ్యక్షుడు లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా నాయకులు శ్రీనివాస రాజు, వేణుగోపాల్, చంద్రశేఖర్, శ్రీధర్‌చారి, కృష్ణ, శ్రీనివాసులు, కేశవులు, శివ, యాకుబ్, జాంగీర్‌లు పాల్గొన్నారు.

ఆర్టిజన్స్ కార్మికుల రిలే నిరాహార దీక్ష



నాగర్‌కర్నూల్‌రూరల్: ఆర్టిజన్స్ కార్మిక ఉద్యోగ సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆర్టిజన్స్ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలను ఆయన ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఎన్నికల హామీలలో భాగంగా రెగ్యులర్ ఉద్యోగులకు వర్తించే నిబంధనలను ఆర్టిజన్స్ కార్మిక ఉద్యోగులకు వర్తింపజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్టిజన్స్ కార్మిక ఉద్యోగులు శీనయ్య, ఆంజనేయులు, చంద్రశేఖర్, శ్రీనివాసులు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

మెటీరియల్ పంపిణీ

తాడూరు: మండలంలోని బలాన్‌పల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మాజీ ఎంపీపీ గుర్రాల శ్రీదేవి–పరమేశ్వర్ రెడ్డి దంపతులు రూ.20 వేలు విలువ చేసే 70 మంది విద్యార్థులకు టై, బెల్టులు, ఐడీ కార్డులు, బూట్లు సమకూర్చారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి దాతలతో కలిసి అందజేశారు. హెచ్ఎం అనురాధ, కాంప్లెక్స్ హెచ్ఎం రమేష్ కుమార్, ఉపాధ్యాయులు లక్ష్మణ్, శ్రీనివాస చారి, సైదులు, తదితరులు పాల్గొన్నారు.

మైక్‌సెట్ బహూకరణ



కందనూలు: నాగర్‌కర్నూల్ మండలంలోని గగ్గలపల్లి ఉన్నత పాఠశాలకు లయన్స్‌క్లబ్, క్లాస్‌మేట్ ఆధ్వర్యంలో శుక్రవారం రూ.35వేలు విలువ చేసే మైక్‌సెట్‌ను సమకూర్చారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రమేష్ కుమార్ హెచ్ఎం రాజశేఖర్‌రావుకు అందజేశారు. అదే విధంగా బాలికల దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. లయన్స్‌క్లబ్ సభ్యులు, క్లాస్‌మెట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా: విద్యార్థులకు గాయాలు

తాడూరు: ఆటో బోల్తాపడి పలువురి విద్యార్థులకు గాయపడిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం మండలంలోని పాపగల్‌కు చెందిన విద్యార్థులు 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న సిర్సవాడ ఉన్నత పాఠశాలకు ఆటోలో బయలుదేరారు. పాపగల్ సిర్సవాడ మధ్యలో ఓ రైతు షెడ్డు వద్ద ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ విష్ణుతో పాటు విద్యార్థులు శరణ్, పల్లవి, తదితరులు గాయపడ్డారు. చికిత్సనిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఆర్టీసీ డిపో ఎదుట కార్మికుల నిరసన



కొల్లాపూర్: పట్టణంలోని ఆర్టీసీ డిపో గేట్ ఎదుట ఎస్‌డబ్ల్యూఎఫ్ సంఘానికి చెందిన కార్మికులు బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. డిపో కార్యదర్శి మదుసూదన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎలక్ట్రిక్ బస్సుల పథకంలో సవరణలు చేయాలన్నారు. అవసరమైన నిధులు కేటాయించాలన్నారు. ప్రజల అవసరాల మేరకు బస్సుల సర్వీసులు పెంచాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్మికులు ఉన్నారు.

మానవత్వం చాటిన పోలీసు



మన్ననూర్: గ్రామంలోని ప్రధాన రహదారిలో మూల మలుపు వద్ద ఉన్న కంపచెట్లను గ్రామానికి చెందిన కానిస్టేబుల్ రాందాస్ తొలగించి మానవత్వం చాటుకున్నాడు. వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించడంతో గ్రామస్తులు కానిస్టేబుల్‌ను అభినందించారు.

రవాణా వ్యవస్థలో డ్రైవర్ల పాత్ర కీలకం

అచ్చంపేట రూరల్: రవాణా వ్యవస్థలో డ్రైవర్ల పాత్ర కీలకమని అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ఆవరణలో డ్రైవర్స్‌డేను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, డ్రైవర్లు భారీ ర్యాలీ తీశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ డ్రైవర్ల సేవలను గుర్తించడానికి ప్రతిఏటా ఆర్టీసీ సంస్థ డ్రైవర్స్‌డేను నిర్వహిస్తోందన్నారు. ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షిత ప్రయాణం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీఐ రవీందర్, ఎస్ఐ రమేష్, ఆర్టీసీ డీఎం పి. మురళీదుర్గాప్రసాద్, ఏడీసీ జంగిరెడ్డి, నాగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా డ్రైవర్స్ డే వేడుకలు

కొల్లాపూర్: పట్టణంలోని ఆర్టీసీ డిపో నుంచి డ్రైవర్లు ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ చౌరస్తాలో డ్రైవర్లను డిపో మేనేజర్ ఉమాశంకర్‌తో పాటు గాంధీ హైస్కూల్‌కు చెందిన ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో గాంధీ హైస్కూల్ హెచ్ఎం శోభారాణి తోపాటు పలువురు ఉపాధ్యాయులు, ఆర్టీసీ ఉద్యోగులు ఉన్నారు.



అచ్చంపేటలో ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు